## క్లుప్తంగా

### బస్సు సౌకర్యం కల్పించండి


వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

**వేములవాడరూరల్:** మండలంలోని నూకలమర్రి గ్రామానికి ఆర్టీసీ బస్సు నడపాలని గ్రామస్తులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. నూకలమర్రి నుంచి కొండన్నపేట, ఎదురుగట్ల, చెక్కపల్లి, నమిలిగుండుపల్లి గ్రామాలకు కూడా బస్సు సౌకర్యం లేక ఈ ప్రాంతం నుంచి ధర్మపురి, జగిత్యాల, వేములవాడ ఇతర పట్టణాలకు వెళ్లే ఈ గ్రామాల ప్రజలు ప్రతిరోజూ ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. నూకలమర్రి నుంచి చందుర్తి మండలం తిమ్మాపూర్ వెళ్లే బస్సు కూడా ఈ మధ్యకాలంలో రావడం లేదని వెంటనే నూకలమర్రి గ్రామం మీదుగా ఈ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని వారు కోరారు. ఇందులో బీజేవైఎం మండల అధ్యక్షుడు జంగం వంశీ, ఓబీసీ ఉపాధ్యక్షుడు వనపర్తి పర్శరాములు, తదితరులు పాల్గొన్నారు.

### రైతుల సంక్షేమమే లక్ష్యం


చెక్కులు పంపిణీ చేస్తున్న చైర్మన్ కృష్ణారెడ్డి

**ఎల్లారెడ్డిపేట:** రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రాథమిక సహకార సంఘం పని చేస్తుందని, వ్యవసాయ అనుబంధ రంగాలను అభివృద్ధి చేసేందుకు పెద్ద ఎత్తున రుణాలను అందిస్తున్నట్లు సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి అన్నారు. సహకార సంఘంలో గురువారం ఏడుగురు రైతులకు రూ.20.50 లక్షల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెయిరీ, గొర్రెలు, పట్టు పురుగులు, కోళ్ల పెంపకంపై పెద్ద ఎత్తున రుణాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ జంగిటి సత్తయ్య, డైరెక్టర్లు వెంకట నర్సింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

### గాయపడిన గీత కార్మికులను ఆదుకోవాలి


మాట్లాడుతున్న అమర్‌గౌడ్

**సిరిసిల్లటౌన్:** వృత్తిపరంగా గాయపడుతున్న గీత కార్మికులకు కూడా బీమా వర్తించేలా చర్యలు తీసుకుని ఆదుకోవాలని గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) జిల్లా అధ్యక్షుడు కంచర్ల అమరేందర్‌గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులకు ప్రమాద బీమా ఇవ్వడం హర్షించదగిన విషయమన్నారు. చాలామంది గీత కార్మికులు వృత్తి రీత్యా కాలు, చేయి విరిగి ఉపాధికి దూరంగా ఉంటూ వారి కుటుంబాలు దైన్యస్థితిని ఎదుర్కొంటున్నాయన్నారు. దళితబంధు మాదిరిగా గౌడ్‌బంధు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. నాయకులు లక్ష్మీనారాయణ, వదర బాల్‌రాజ్, పాముల దేవయ్య, పులి రాజు, బుర్ర శ్రీనివాస్, లక్ష్మన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# సొంతిల్లు కలేనా?

- 'డబుల్' కోసం ఎదురుచూపు
- పూర్తయిన లబ్ధిదారుల ఎంపిక
- కేటాయింపులో జాప్యం
- ఆశగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులు


సిరిసిల్ల పెద్దూరు శివారులో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయం

**సిరిసిల్లఅర్బన్:** పేదోడి సొంతింటి కల, కలగానే మిగులుతోంది. ఇళ్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇస్తామన్న హామీ ఏళ్లు గడుస్తున్నా నేరవేరడం లేదు. ఇదిగో ఇస్తాం.. అదుగో ఇస్తాం.. అని కాలయాపన చేయడంతో లబ్ధిదారుల ఆశలు అడియాశలుగా మారుతున్నాయి.

సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరు, రగుడు శివారుతో పాటు శాంతినగర్‌లో నిరుపేదల కొరకు డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం చేపట్టింది. ఏళ్లు గడుస్తున్నా ఇంకా పనులు పూర్తి కాలేదు. డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయంలో నేటికి డ్రెయినేజీ, రోడ్లు, తదితర నిర్మాణ పనులు నత్తతో పోటీపడుతున్నాయి. డబుల్ బెడ్రూం ఇళ్ల ఆశావాహులు మాత్రం తమకు ఇళ్లు ఎప్పుడిస్తారో అని ఎదురు చూస్తున్నారు.

### కొనసాగుతున్న పనులు

సిరిసిల్ల పట్టణంలో ఆరేళ్ల క్రితం డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. ఇందులో మండెపల్లిలో 1,260, శాంతినగర్‌లో 204, పెద్దూరు 516, రగుడు శివారులో 72 ఇళ్లను ప్రభుత్వం నిర్మించింది. మండెపల్లిలో తప్ప మిగిలిన చోట్ల పనులు ఇంకా పూర్తి కాలేదు. పెద్దూరు, రగుడు, శాంతినగర్ డబుల్ బెడ్రూం సముదాయాల్లో డ్రెయినేజీ, రోడ్లు, మంచినీటి, విద్యుత్ తదితర మౌలిక వసతుల నిర్మాణ పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికే పట్టణంలోని పలు వార్డులలో డబుల్ బెడ్రూం లబ్ధిదారులను డ్రా ద్వారా ఎంపిక చేశారు. ఎంపికైన లబ్ధిదారులు తమ సొంతిల్లు కల నేరవేరుతుందన్న ఆశ నెలలు గడుస్తున్న నెరవేరడం లేదు. అధికారులు స్పందించి వెంటనే డబుల్ బెడ్రూం ఇళ్ల పనులను త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

### త్వరగా పూర్తిచేయాలి


డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణ పనులను తొందరగా పూర్తి చేయాలి. ఇటివలే డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ఎంపిక డ్రాలో నా పేరు వచ్చిందని చెప్పగానే సంతోషపడ్డాం. కానీ నెలలు గడుస్తున్న ఇంకా ఇల్లు కేటాయించలేదు. తొందరగా ఇల్లు అందజేస్తే కిరాయి భారం తగ్గుతుంది.

– గుగ్గిళ్ల రజిత

### కిరాయి దొరకడం లేదు


మాది రగుడు. ఇక్కడ కిరాయి దొరక్క పోవడంతో మా అమ్మ వారి ఊళ్ళో ఉంటున్నాను. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ డ్రాలో నాపేరు వచ్చింది. కానీ నేటికి ఇళ్ళు ఇవ్వలేదు. ఇళ్ళను ఎప్పుడు ఇస్తార అని ఎదిరి చూస్తున్నాం. ఇండ్ల నిర్మాణ పనులను పూర్తి చేసి అందించాలి.

– సిరిసిల్ల లక్ష్మి, రగుడు

### ఏళ్లుగా పూరి గుడిసిలో..


మాది పెద్దూరు తుర్కాశీ పల్లె. ఏండ్లుగా పూరి గుడిసెలోనే ఉంటున్నాం. డ్రాలో పేరు వచ్చింది. ఇల్లు వస్తుందని ఆనందించాం. కానీ నెలలు గడిచిన ఇల్లు ఇవ్వలేదు. అదే పూరి గుడిసెలోనే జీవిస్తున్నాం. ఇప్పటికైనా నా మాపై దృష్టి సారించి ఇండ్ల కేటాయింపులో జాప్యం లేకుండా చూడాలి,

– షేక్ మదిన,పెద్దురు

# పల్లె దవాఖానాలు ఎప్పుడు తెరుస్తరు?


మర్రిగడ్డలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పల్లె దవాఖాన

- నిర్మించి ఐదు మాసాలైనా నిరుపయోగంగా..
- అందుబాటులోకి 14 రకాల సేవలు
- మర్రిగడ్డ అద్దె భవనంలో దవాఖాన

**చందుర్తి:** గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండాలని నిర్మించిన పల్లె దవాఖానాలు ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగానే మిగిలాయి. చందుర్తి పీహెచ్‌సీ పరిధిలోని 6 ఉపఆరోగ్య కేంద్రాలలో మూడపల్లి, మర్రిగడ్డ కేంద్రాలను పల్లె దవాఖానాలుగా మార్చారు. వీటికి రూ.16 లక్షల వ్యయంతో భవనాలను నిర్మించారు. ఉప ఆరోగ్య కేంద్రాల్లో ఏఎన్‌ఎంలతో పాటు ఆశ వర్కర్లు మాత్రమే పని చేసేవారు. కాని ఈ పల్లె దవాఖానాల్లో మాత్రం ఎంబీబీఎస్ డాక్టర్ అందుబాటులో ఉంటాడు. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని భావిస్తున్నారు.

### వాకిట్లో వైద్యం

గ్రామీణ ప్రాంతాల్లో సైతం జీవనశైలి మారిడంతో వ్యాధులు విజృంభిస్తున్నాయి. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోంది. వాటిని సకాలంలో గుర్తించకపోవడంతో కిడ్నీ, పక్షవాతం, గుండె జబ్బు బారినపడుతున్నారు. ప్రాథమిక స్థాయిలోనే వీటిని గుర్తించి, నియంత్రించేందుకు ఈ దవాఖానాలు పనిచేస్తాయి. ఒకవేళ సమస్య పెద్దగా ఉంటే ముందుగా రిఫరల్ ఆసుపత్రి అయిన పీహెచ్‌సీ, లేదా జిల్లా ఆసుపత్రికి పంపుతారు.

### 14 రకాల ఉచిత పరీక్షలు

పల్లె దవాఖానాల్లో 14 రకాల వైద్య పరీక్షలు పూర్తిఉచితంగా ర్యాపిడ్ కిట్లతో చేసి, వెంటనే ఫలితాలు వెల్లడించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో రోగ నిర్ధారణ అయిన వెంటనే చికిత్స అందించేందుకు వీలుగా ఉంటుందని వైద్యశాఖ ప్రచారం చేస్తోంది. ఈ కేంద్రాల్లో 105 రకాల మందులను అందుబాటులో ఉంచేందుకు నిర్ణయం తీసుకున్నారు. అత్యవసర మందులతో పాటు జీవనశైలి, మానసిక ఆరోగ్యానికి సంబంధించిన డ్రగ్స్‌ను కూడా ఇక్కడ అందజేస్తారు. పారాసిటమాల్, యాంటీ బయాటిక్స్, బీ కాంప్లెక్స్, విటమిన్స్ ట్లాబ్లెట్‌తో పాటు బీపీ, షుగర్ ఔషధాలను కూడా అందుబాటులో ఉంచుతారు. వైద్య పరీక్షలే కాకుండా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కోసం వ్యాయామం, యోగా వంటివి చేయిస్తారు. ఏదైనా స్పెషాలిటీ వైద్యులతో మాట్లాడేందుకుంటే టెలీ కన్సల్టేషన్ సౌకర్యం కూడా అందుబాటులో ఉంటుంది.

### అద్దె భవనంలో ఇబ్బంది


మర్రిగడ్డ ఉప ఆరోగ్య కేంద్రాన్ని పల్లె దవాఖానగా మారుస్తూ భవన నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఐదు మాసాలు గడుస్తున్న ప్రారంభించడం లేదు. అద్దె భవనంలో అసౌకర్యాలతో ఇబ్బంది పడుతున్నాం. పల్లె దవాఖానాను ప్రారంభిస్తే ఇబ్బందులు తప్పుతాయి.

– రేణుక, ఏఎన్‌ఎం, ఉపఆరోగ్య కేంద్రం మర్రిగడ్డ

### విద్యుత్ లైన్‌కు నిధులు మంజూరు చేయాలి


పల్లె దవాఖాన భవనాన్ని నిర్మించారు. విద్యుత్ పనులు అన్ని పూర్తి చేశారు. కానీ విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు విద్యుత్ లైన్ వేయించేందుకు గ్రామపంచాయతీలో నిధులు లేవు. ఎమ్మెల్యే నిధులు కేటాంచాలి. విద్యుత్ సౌకర్యం కల్పిస్తే పనులు పూర్తయినట్లే.

– నేతికుంట జలపతి, సర్పంచ్, మర్రిగడ్డ

### ప్రారంభించాలని కోరాం


పల్లె దవాఖాన ప్రారంభిస్తే గ్రామ ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ఎదురుచూస్తున్నాం. ప్రస్తుతం ఉప ఆరోగ్య కేంద్రంలో పూర్తిస్థాయి సౌకర్యాలు లేవు. కొత్త భవనాన్ని ప్రారంభిస్తే ఇబ్బందులు తప్పుతాయి. పనులు పూర్తి చేసి, ప్రారంభించాలని కోరాం.

– చిలుక అంజిబాబు, సర్పంచ్, మూడపల్లి

## కళ్లకు గంతలు కట్టుకుని..


తంగళ్లపల్లిలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న జేపీఎస్‌లు

**తంగళ్లపల్లి/చందుర్తి/కోనరావుపేట:** తమ న్యాయమైన డిమాండ్‌లను నెరవేర్చాలని నిరవధిక సమ్మె చేస్తున్న జేపీఎస్, ఓపీఎస్‌లు 7వ రోజు గురువారం కళ్లకు గంతలు కట్టుకుని తమ నిరసన తెలియజేశారు. తంగళ్లపల్లిలో జేపీఎస్‌లు జనార్ధన్, వాణి మాట్లాడుతూ ప్రభుత్వం జేపీఎస్ సమ్మెను గుర్తించడం లేదని, చూసీ చూడనట్లు వ్యవహరిస్తోందని, అందుకే కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపినట్లు తెలిపారు. ఇప్పటికైనా సీఎం కేసీఆర్ పెద్ద మనసుతో స్పందించి ఆయన ఇచ్చిన మాట ప్రకారం తమను రెగ్యులర్ చేయాలని, తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. చందుర్తిలో సెస్ మాజీ చైర్మన్ అల్లాడి రమేశ్, బీజేపీ జిల్లా కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి మార్త సత్తయ్య, మండల అధ్యక్షుడు పోంశెట్టి రాకేశ్, కోనరావుపేటలో బీజేపీ జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్‌రావు, రాష్ట్ర నాయకులు ఎర్రం మహేశ్, అల్లాడి రమేశ్, ఎంపీటీసీలు కోనేటి రేణుక, సమ్మెకు మద్దతు ప్రకటించి పాల్గొన్నారు.


చందుర్తిలో..

### ప్రభుత్వ ఆసుపత్రి సేవలు వినియోగించుకోవాలి


ఆపరేషన్ చేయించుకున్న వారితో వైద్యులు

**వేములవాడఅర్బన్:** వేములవాడ పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రి సేవలు వినియోగించుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రేగులపాటి మహేశ్‌రావు అన్నారు. ఆసుపత్రిలో తొమ్మిది కంటి ఆపరేషన్లు విజయవంతంగా పూర్తిచేసినట్లు తెలిపారు. డాక్టర్లు అనిల్ కుమార్, రత్నమాల, నర్సింగం, రాజేందర్ పాల్గొన్నారు.

### నీరాతో సంపూర్ణ ఆరోగ్యం

**ఎల్లారెడ్డిపేట:** నీరా పానీయం ఆరోగ్యానికి మేలని, నీరా సేవించిన వారు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ఎక్సైజ్ సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్ అన్నారు. ప్రభుత్వం హైదరాబాద్‌లో ప్రవేశపెట్టిన నీర కేఫ్ కార్యక్రమానికి సర్కిల్ పరిధిలో 60 మంది గౌడ కులస్తులు వెళ్లారు. ఎల్లారెడ్డిపేటకు చెందిన బాలగౌడ్ నీరా బాటిల్‌ను గురువారం సీఐకి అందజేశారు. నీరా ఒక ఔషదంలా పనిచేస్తుందని, అందరూ నీరాను సేవించాలని సీఐ సూచించారు.

### కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

**ఎల్లారెడ్డిపేట:** మండలంలోని అల్మాస్‌పూర్, దుమాల, రాచర్లగుండారం గ్రామాల్లో కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఎంపీపీ పిల్లి రేణుక గురువారం పంపిణీ చేశారు. సర్పంచులు పుష్ప, రజిత, శంకర్‌నాయక్, వైస్‌ఎంపీపీ కదిరె భాస్కర్ పాల్గొన్నారు.

### నోట్‌బుక్కులు పంపిణీ హర్షణీయం

**సిరిసిల్లఎడ్యుకేషన్:** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్కులు అందించే నిర్ణయం హర్షణీయమని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గన్నమనేని శ్రీనివాస్‌రావు, ఎడ్ల కిషన్ అన్నారు. గురువారం స్థానిక మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పాటు అనంతరం విద్యా విధానంలో పలు నిర్మాణాత్మకమైన, గుణాత్మకమైన అభివృద్ధి దిశగా మార్పులు చోటుచేసుకుంటున్నాయన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి దొడ్డు బియ్యం బదులుగా సన్నబియ్యం, వారానికి మూడుసార్లు కోడిగుడ్లు అందించడంలాంటి ఎన్నో మార్పులు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలవైపు మళ్లించాయన్నారు. ఈ సౌకర్యాలను వినియోగించుకోని ప్రజలు ప్రభుత్వ పాఠశాలల్లో వారి పిల్లలను చేర్చి మంచి విద్యను అందించాలన్నారు.

# వ్యాయామ గురువు రాజన్నకు నివాళి

- కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే రమేశ్‌బాబు


రాజయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

**వేములవాడ:** 1960 ప్రాంతంలో వేములవాడలో వ్యాయామశాల ప్రారంభించి ఈ ప్రాంత యువతరానికి ఆదర్శంగా నిలిచిన వ్యక్తి ఎస్.రాజయ్య అని ఎమ్మెల్యే రమేశ్‌బాబు కొనియాడారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించి మాట్లాడారు. ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూనే యువతకు ఆదర్శంగా నిలిచారనీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ సంఘం ఏర్పాటు చేసి సేవాభావాన్ని పెంపొందించారన్నారు. ఉపాధ్యాయ సంఘం నాయకులుగా, యాదవ సంఘం నాయకులుగా ఈ ప్రాంతానికి ఎనలేని సేవలందించిన రాజయ్య మరణం ఈ ప్రాంతానికే తీరనిలోటని ఆయన అన్నారు.

### అంగన్‌వాడీలో వార్షికోత్సవం


వార్షికోత్సవంలో పాల్గొన్న పిల్ల తల్లులు

**కోనరావుపేట:** మండలంలోని మర్తనపేట, ధర్మారం గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లలో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. స్థానిక గ్రామపంచాయతీలో నిర్వహించిన కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కనుకమ్మ, అంగన్‌వాడీ టీచర్ సునీత, వార్డు సభ్యులు అనిత, లత, ఏఎన్‌ఎం అశ్విని, ఆశవసుంధర, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### జనవిజ్ఞాన వేదిక ప్లీనంకు తరలిరావాలి

**బోయినపల్లి:** జనవిజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర 4వ ప్లీనం సమావేశాలు ఈ నెల 6, 7 తేదీల్లో నల్లగొండ పట్టణంలో జరుగుతాయని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి సంపతి రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు ప్లీనం సమావేశాలకు జిల్లా నాయకులు, సైన్స్ అభిమానులు హాజరుకావాలని కోరారు.

### ధాన్యం తూకం వేయాలి

**రుద్రంగి:** కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి పక్షం రోజులైనా, ఇప్పటికీ ధాన్యం తూకం వేయడం లేదని, వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని డీసీసీ కార్యదర్శి చెలుకల తిరుపతి డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లయ్యకు వినతిపత్రం అందజేశాను. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశం, గంగారాం, మనోహర్, గంగాధర్, లింగం, దాస్, గంగ నర్సయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సమాచారం

### నేడు చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ

**వేములవాడరూరల్:** మండలంలోని లింగంపల్లి గ్రామంలో శుక్రవారం చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ జరగనున్నట్లు బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సామ లచ్చిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, ఎమ్మెల్యే రమేష్‌బాబు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు.

# అంధత్వ నివారణే సర్కారు లక్ష్యం

- సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ
- కంటివెలుగు శిబిరాలు ప్రారంభం


పరీక్షలు చేయించుకుంటున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ శ్రీనివాస్


కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్ వేణు

**సిరిసిల్లటౌన్:** అంధత్వ నివారణే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర సర్కారు కంటివెలుగు కార్యక్రమాన్ని చేపట్టిందని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. గురువారం సిరిసిల్లలోని 30వ వార్డులో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఆలోచనలో రూపుదిద్దుకున్న కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 18 ఏళ్లు దాటిన వారు వివిధ కంటి జబ్బులకు శిబిరాల్లో ఉచిత చికిత్స పొందాలని కోరారు. వారం రోజుల పాటు వార్డులో జరిగే కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్ పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి పాల్గొన్నారు.

### సద్వినియోగం చేసుకోవాలి

**ఇల్లంతకుంట:** కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు అన్నారు. మండలంలోని కిష్టారావుపల్లి, అనంతారం గ్రామాల్లో కంటివెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచులు చల్ల నారాయణ, ముస్కు మల్లయ్య, ఎంపీటీసీలు పుష్పలత, స్రవంతి, వైద్యాధికారి రమేశ్ ఉపసర్పంచ్ తిరుపతి పాల్గొన్నారు.

### శిబిరాన్ని పరిశీలించిన కమిషనర్

**వేములవాడ:** స్థానిక 28వ వార్డులో బ్రహ్మంగారి ఆలయంలో గురువారం ఏర్పాటు చేసిన కంటివెలుగు కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ అన్వేశ్ పరిశీలించారు. నేటి నుంచి ఆదివారం వరకు సెలవున్నప్పటికీ కార్యక్రమం కొనసాగించనున్నట్లు తెలిపారు. 110 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు లహరి, ప్రకాశ్, ఏఎన్‌ఎంలు వెంకటలక్ష్మి, సృజన, ఆశ వర్కర్లు సృజన, జ్యోతి, విజయలక్ష్మి, విజయ, శ్రావణి, డీఈవో గీత, ఆర్పీలు పాల్గొన్నారు.

**ఎల్లారెడ్డిపేట:** మండలంలోని అక్కపల్లిలో కంటివెలుగు శిబిరాన్ని ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు ప్రారంభించారు. కంటి జబ్బులతో బాధపడుతున్న వారిని పరీక్షించి కంటి అద్దాలను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ముక్క మధుకర్, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, వైస్‌ఎంపీపీ కదిరె భాస్కర్, నాయకులు పాల్గొన్నారు.

**బోయినపల్లి:** మండలంలోని నీలోజిపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో సర్పంచ్ కూస పద్మ ప్రారంభించిన కంటివెలుగు శిబిరాన్ని ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ సందర్శించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ కొనుకటి నాగయ్య, సింగిరెడ్డి బాలమల్లు, వైద్యాధికారిణి రేణు ప్రియాంక పాల్గొన్నారు.

### భక్తి శ్రద్ధలతో నృసింహ జయంతి

**సిరిసిల్ల కల్చరల్:** అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం ఇస్కాన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం నృసింహ జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బైపాస్ రోడ్‌లోని కే-కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన వేడుకలకు వందలాదిగా కృష్ణ భక్తులు హాజరయ్యారు.





# గ్రామాలకు ఇన్‌చార్జి కార్యదర్శులు

**కోనరావుపేట:** మండలంలోని గ్రామాల కార్యదర్శులు సమ్మె చేస్తున్న కారణంగా గ్రామాలకు ఇన్‌చార్జి కార్యదర్శులను నియమించినట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. మండల పరిషత్ సూపరింటెండెంట్ శంకర్‌రెడ్డికి అజ్మీరాతండా, ఎగ్లాస్‌పూర్, ఊరుతండా, నిమ్మపల్లి, శివంగాలపల్లి గ్రామాలకు ఇన్‌చార్జిగా నియమించగా, ఎంపీవో రాజుకు బావుసాయిపేట, కోనరావుపేట, మామిడిపల్లి, నిజామాబాద్ గ్రామాలు, జూనియర్ అసిస్టెంట్ మణిదీప్‌కు ధర్మారం, గొల్లపల్లి(కొలనూర్), కొలనూర్, మల్కపేట, మర్తనపేట గ్రామాలు, జూనియర్ అసిస్టెంట్ భరత్‌కు గొల్లపల్లి(వట్టిమల్ల), కమ్మరిపేటతండా, గోవిందరావుపేటతండా, భుక్యారెడ్డితండా, మరిమడ్ల, వట్టిమల్ల గ్రామాలు, కార్యదర్శి జగదీశ్ , కనగర్తి, మంగళ్లపల్లి, సుద్దాల గ్రామాలు, టైపిస్ట్ రామస్వామికి కొండాపూర్, నాగారం, పల్లిమక్త, రామన్నపేట గ్రామాలకు ఇన్ చార్జిగా కేటాయించినట్లు వివరించారు.